సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

పౌర్ణమి వేళ.. గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని స్థానిక సెక్టార్–1 వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద బుధవారం గిరి ప్రదక్షిణ నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమైన గిరి ప్రదక్షిణ ఆద్యంతం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, హరినారాయణ స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రూ.30 లక్షలతో అభివృద్ధి పనులు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక : 67వ వార్డులోని వివిధ కాలనీల్లో రోడ్లు, కాలువల నిర్మాణానికి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. కృష్ణానగర్, జోగవానిపాలెం, పెంటయ్యనగర్ కాలనీలలో రూ.30 లక్షల వ్యయంతో ఈ పనులను చేపట్టనున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు పల్లా పెంటారావు, అచ్చిన్నాయుడు, జోసెఫ్, అన్నపూర్ణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందిస్తున్న వెంకటరమణ

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని కన్యకాపరమేశ్వరి పంచాయతన దేవాలయ గాలి గోపురం ఫ్లోరింగ్ నిర్మాణానికి పెదగంట్యాడకు చెందిన గునిశెట్టి వెంకటరమణ 10 వేల116 రూపాయలు విరాళం అందించారు. ఆలయ కమిటీ ప్రతినిధి ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టికి దాత బుధవారం నగదు అందజేశారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు ముసలినాయుడుపాలెంలో తాగునీటి సమస్యను పరిష్కరించామని కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి తెలిపారు. కొంతకాలంగా ఈ ప్రాంతంలో కలుషిత నీరు వస్తోందని స్థానికులు తెలియజేయడంతో, అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. వారు కొత్తగా పైప్‌లైన్ వేసి, నీరు సరఫరా చేశారని చెప్పారు. కార్యక్రమంలో పులి వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుబంధాలకు ప్రతీక రక్షాబంధన్

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- కణితి హైస్కూల్‌లో ఘనంగా రాఖీ వేడుకలు



ఎమ్మెల్యే నాగిరెడ్డికి రాఖీలు కడుతున్న విద్యార్థినులు

కూర్మన్నపాలెం: అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్ నిలుస్తుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఆ విలువలను ప్రతీ ఒక్కరూ కాపాడాలని విద్యార్థులకు సూచించారు. జీవీఎంసీ 87వ వార్డు కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ మానవీయ సంబంధాలను పటిష్టం చేస్తూ సోదర ప్రేమకు ప్రతీకగా పిలిచే రక్షా బంధన్ పండగ సమాజంలో సంప్రదాయాలను, విలువలను మరింతగా పెంపొందిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలనే సందేశాన్నిస్తుందన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థినులు, మహిళలతో రాఖీలు కట్టించుకుని, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గాజువాక కన్వీనర్ తిప్పల దేవన్‌రెడ్డి, 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భెల్ గుర్తింపు యూనియన్ ఎన్నికలు నేడు



భెల్ పరిపాలనా భవనం

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) గుర్తింపు యూనియన్ ఎన్నికలు గురువారం నిర్వహించనున్నారు. సంస్థ వెల్ఫేర్ బిల్డింగ్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్న పోలింగ్‌లో 446 మంది కార్మికులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల్లో మూడు యూనియన్లు పోటీలో నిలిచాయి.

- బీహెచ్‌పీవీ నేషనల్ ఎంప్లాయీస్ యూనియన్ (సీరియల్ నం.2): ప్రోగ్రెసివ్ ఫ్రంట్ ప్యానెల్‌లో ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, వైఎస్సార్ టీయూసీ, ఏఐసీటీయూ, ప్రగతిశీలశక్తుల యూనియన్లు ఉన్నాయి. సీఐటీయూ నుంచి అధ్యక్షుడిగా జి.టి.పి.ప్రకాష్, ఐఎన్‌టీయూసీ నుంచి ప్రధాన కార్యదర్శిగా ఉరుకూటి బాబూరావు పోటీ చేస్తున్నారు.
- యునైటెడ్ ఫ్రంట్ (సీరియల్ నం.3): యునైటెడ్ ఫ్రంట్ (ఏఐటీయూసీ) ప్యానెల్‌లో ఏఐటీయూసీ, బీహెచ్‌పీవీ ఎంఎస్, టీఎన్‌టీయూసీ, వైఎస్సార్ టీయూ, డీఈయూ, బీఈఆర్‌పీటీయూ, యూత్ ఎంప్లాయీస్ యూనియన్లు ఉన్నాయి. బీహెచ్‌పీవీ ఎంఎస్ నుంచి బొండా బాబూరావు అధ్యక్షుడిగా, టీఎన్‌టీయూసీ నుంచి సుఖాకర్ సాహు ప్రధాన కార్యదర్శిగా బరిలో ఉన్నారు.
- బీఎంఎస్ యూనియన్ (సీరియల్ నం.1): ఎన్నికల్లో మరో యూనియన్‌గా బీఎంఎస్ బరిలో నిలిచింది.

పోలింగ్ ముగిసిన అనంతరం సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు. ఫలితాలను ఎన్నికల అధికారి డి.శ్రీనివాసులు వెల్లడించనున్నారు.

స్టీల్‌ప్లాంట్ జోలికొస్తే సహించం

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్



930వ రోజు ఉక్కు దీక్ష శిబిరంలో పాల్గొన్న కేఏ పాల్

కూర్మన్నపాలెం(గాజువాక): ఉక్కు పోరాట యోధుల ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ సహించమని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కే.ఏ.పాల్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 930వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షకు ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కే.ఏ.పాల్ సంఘీభావం తెలుపుతూ దీక్ష శిబిరం వద్ద మౌనపోరాటం చేశారు. అనంతరం కే.ఏ.పాల్ మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌ను కాపాడడంలో రాష్ట్ర ఎంపీలకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఉక్కు పోరాట కమిటీ నాయకులను ఢిల్లీ తీసుకువెళ్లి ప్రధాని నరేంద్రమోదీ ఇంటి ముందు నిరాహార దీక్ష చేస్తానన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి ఉక్కు ప్రైవేటీకరణ జరగదని ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

త్రిఫ్ట్ సొసైటీ మెరిట్ అవార్డుల ప్రదానం నేడు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం మెరిట్ అవార్డులు ప్రదానం చేయనున్నారు. ఏటా ఉద్యోగుల పిల్లలకు అందజేసే కార్యక్రమంలో భాగంగా సాయంత్రం సెక్టార్–1 స్టీల్‌క్లబ్‌లో అవార్డులు అందజేయనున్నారు. కార్యక్రమానికి స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) డి.కె. మొహంతి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని సొసైటీ ఉపాధ్యక్షుడు ఆనంద్ తెలిపారు.

'సర్వహిత' పింఛనుదారులకు వస్త్రాల పంపిణీ



వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడకకు చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ మాజీ చైర్మన్ గంధోళి నరసింగరావు, వరలక్ష్మి దంపతుల సహకారంతో ఆనందిత దివస్ కార్యక్రమంలో 75 మంది పింఛన్‌దారులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. నరసింగరావు, వరలక్ష్మి దంపతుల 50వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ట్రస్ట్ ద్వారా పింఛన్ పొందుతున్న వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులకు చీరలు, పంచెలు, తువ్వాళ్ల పంపిణీతో పాటు భోజనం ఏర్పాటు చేశారు. గంధోళి శ్రీనివాసరావు, రజని, ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుడే సుశీలా గజేంద్రరావు, సలహాదారులు పట్టా రామ అప్పారావు, జామి గణేష్, కిడిమి హనుమంతురావు, ఎల్. రాము పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం



జూనియర్ కళాశాల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అగనంపూడి: విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌కు విద్య, వైద్యం రెండు కళ్లు వంటివన్నారు. ఈ రెండు బాగుంటే ప్రజలు బాగుంటారని, రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తుందని భావించి వేల కోట్ల రూపాయలతో రెండు వ్యవస్థలను ఆధునీకీకరిస్తున్నారన్నారు. ఉన్నవాడు, లేనివాడనే భేదం లేకుండా విద్యారంగంలో అందరికీ సమాన అవకాశాలు కల్పించడం కోసం నాడు–నేడు, విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి తదితర కార్యక్రమాలు చేపట్టారన్నారు. లక్షల మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుని ఉద్యోగాల్లో స్థిరపడే అవకాశాన్ని కల్పించారన్నారు. అనంతరం ఇంటర్ ఫలితాల్లో జిల్లాలో ప్రథమ స్థాయిలో నిలిచిన కళాశాల విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ, కళాశాల ప్రిన్సిపాల్ వి.సుశీల్‌కుమార్, వైఎస్సార్ సీపీ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్, పార్టీ జిల్లా కార్యదర్శి నక్కా రమణబాబు, మామిడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆల్‌రౌండ్ చాంపియన్లకు అభినందనలు



ఆల్ రౌండ్ చాంపియన్‌షిప్ ట్రోఫీని అందిస్తున్న నాయకులు

కూర్మన్నపాలెం: కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల గాజువాక హైస్కూల్లో త్రోబాల్, కబడ్డీ, రన్నింగ్ తదితర పోటీల్లో ప్రతిభ కనబరిచి ఆల్ రౌండ్ చాంపియన్‌షిప్ ట్రోఫీ గెలుచుకున్నారు. ఈ సందర్భంగా విజేతలు నవీన్, సునీత, శ్రీవాణి, హేమ, దుర్గ తదితరులను స్థానిక 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం అభినందించారు. పాఠశాల ఆవరణలో స్కూల్ సిబ్బంది, పిల్లల తలిదండ్రులు స్థానికుల సమక్షంలో క్రీడాకారులకు ట్రోఫీని అందించి, ప్రదర్శనకు ఉంచారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవింద్, ముద్దపు దామోదర్, కోమటి రమాదేవి, దుగ్గపు దానప్పలు, చిత్రాడ వెంకటరమణ, బొండా గోవిందరాజులు, పీడీ మన్నాజీ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్



పెదగంట్యాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దస్తావేజు లేఖర్లు

పెదగంట్యాడ: పెదగంట్యాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట దస్తావేజు లేఖర్లు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ప్రైమ్ 2.0 విధానం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం పిలుపు మేరకు ఈ నెల 30, 31 తేదీల్లో పెన్‌డౌన్ చేస్తున్నట్లు తెలియజేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల దస్తావేజుల్లో సమస్యలు ఉత్పన్నమవుతాయని, ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు.

గాజువాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో..

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్డ్ ప్రైమ్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ డాక్యుమెంట్ రైటర్లు బుధవారం పెన్‌డౌన్ నిర్వహించారు. ఈ మేరకు షీలానగర్‌లోని గాజువాక జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కె.రాజుకు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. డాక్యుమెంట్ రైటర్లు మాట్లాడుతూ గురువారం షీలానగర్‌లోని గాజువాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించనున్నట్లు తెలిపారు.

గడపగడపకు సంక్షేమ పథకాలు



గవరజగ్గయ్యపాలెంలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

అక్కిరెడ్డిపాలెం: అర్హతే ప్రాతిపదికగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రతీ గడపకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిదే అని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా 88వ వార్డు గవరజగ్గయ్యపాలెంలో బుధవారం సాయంత్రం ఆయన పర్యటించారు. మహిళలు ఆయనకు హారతులిచ్చి స్వాగతించారు. ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని మహిళలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను నెరవేర్చారన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా పరిపాలనలో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు, వృద్ధాప్య పెన్షన్లు అందిస్తున్న వలంటీర్లు దేశానికే దిక్సూచిగా నిలిచారన్నారు. చిన్నారులకు చాక్లెట్లు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఆళ్ల సత్య అప్పారావు, ఆళ్ల శ్రీనివాసరావు, జగ్గయ్యపాలెం అధ్యక్షుడు కాండ్రేగుల ఈరినాయుడు, ఆళ్ల బూలిరాజు, పొలమరశెట్టి బూలిరాజు, బుదిరెడ్డి కృష్ణ, శతకంశెట్టి శ్రీను, వార్డు సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎన్‌ఐపీఎం నూతన కార్యదర్శిగా శేషగిరిరావు



ఎన్‌ఐపీఎం నూతన కార్యవర్గ సభ్యులు

ఉక్కునగరం: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ (ఎన్‌ఐపీఎం), విశాఖ చాప్టర్ నూతన కార్యదర్శిగా స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీనియర్ మేనేజర్ బి. శేషగిరిరావు ఎన్నికయ్యారు. స్టీల్‌ప్లాంట్‌లో బుధవారం జరిగిన ఎన్‌ఐపీఎం వార్షిక సాధారణ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశంలో ముందుగా 2022–23 వార్షిక నివేదికను సభకు అందజేశారు. ఆ వ్యవధిలోని లెక్కలను సభకు కోశాధికారి తెలియజేశారు. అనంతరం జరిగిన నూతన కార్యవర్గ ఎన్నికలో శేషగిరిరావు కార్యదర్శిగా రెండోసారి ఎన్నికయ్యారు. చైర్మన్‌గా డాక్టర్ ఎస్.వి.ఎస్. సుధాకర్, వైస్ చైర్మన్లుగా ఎస్.రాజారెడ్డి, బి.శ్రీకాంత్, అదనపు కార్యదర్శిగా డాక్టర్ బి.కృష్ణ కుమారి, కోశాధికారిగా కె.గున్నేశ్వర అనిల్‌తో పాటు ఐదుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఎస్‌జీఎఫ్ కార్యదర్శికి సత్కారం



ఎస్జీఎఫ్ కార్యదర్శి నాగేశ్వరరావు, పీడీ రవిని సత్కరిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

అగనంపూడి: మండల వ్యాయామ ఉపాధ్యాయులు సంఘటితంగా చేపట్టిన కార్యక్రమాలు జిల్లా స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చాయని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు అన్నారు. క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగేశ్వరరావును, లంకెలపాలెం హైస్కూల్‌లో పీడీగా పని చేసి తోకాడ హైస్కూల్‌కు బదిలీపై వెళ్లిన పిళ్లా రవిశంకర్‌ను మండల వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఘనంగా సత్కరించింది. లంకెలపాలెంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ మండల వ్యాయామ ఉపాధ్యాయులు చూపిస్తున్న అభిమానం ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో లంకెలపాలెం హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం కె.రమణ, వ్యాయామ ఉపాధ్యాయ సంఘ బాధ్యులు లోవరాజు, లక్ష్మీరాణి, తులసీ సత్యవతి, ఎస్.వి.రమణ, బి.అన్నాజీరావు, శ్రీదేవి, అమ్మాజీ, దేవి, గౌరీ, ఆంజనేయులు పాల్గొన్నారు.

'లక్ష్యం చేరే వరకు చదువుపైనే దృష్టి'



జీవీఎంసీ పాఠశాలలో ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న కోరమాండల్ ప్రెసిడెంట్ అరుణ్

మల్కాపురం: ఎంచుకున్న లక్ష్యాన్ని చేరే వరకు ప్రతి విద్యార్థి చదువుపైనే దృష్టి పెట్టాలని కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రెసిడెంట్ అరుణ్ సూచించారు. కోరమాండల్ సంస్థ సహకారంతో 61వ వార్డు మల్కాపురం జీవీఎంసీ పాఠశాలకు సుమారు రూ.8 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన బయాలజీ, ఫిజిక్స్ ల్యాబ్‌ను ఆయన వార్డు కార్పొరేటర్ కొణతాల సుధతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అరుణ్ మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నత విద్యకు తమ సంస్థ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందన్నారు. ఉపాధ్యాయులు చక్కటి బోధనలతో విద్యార్థులను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్నారు. కార్పొరేటర్ కొణతాల సుధ , కోరమాండల్ జనరల్ మేనేజర్(హెచ్ఆర్)ఆర్.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయిని అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి కలిగించాలి

అగనంపూడి: ప్రతీ విద్యార్థి ఏదో ఒక గేమ్‌లో పాల్గొనేలా ఆసక్తి కల్గించాలని అనకాపల్లి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు అన్నారు. లంకెలపాలెం హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన పెందుర్తి నియోజకవర్గ పరిధి స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతనంగా వ్యాయామ విద్యకు కూడా సమావేశం నిర్వహిస్తుండడం శుభ పరిణామన్నారు. వ్యాయామ విద్య ఉపాధ్యాయులు పలు క్రీడలు, ఆరోగ్యం విద్య, ఇతర అంశాలపై చర్చించుకునే అవకాశం కలుగుతుందన్నారు. ప్రతీ విద్యార్థి క్రీడలు, ఆటలపై ఆసక్తి పెంపొందించుకునేలా వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రేరణ కల్గించాలన్నారు. కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గం, పరవాడ మండలాల కో–ఆర్డినేటర్లు లక్ష్మీరాణి, లోవరాజు, పెందుర్తి కో–ఆర్డినేటర్లు రెహమాన్, చందన్‌వర్మ, సుజాత, పరవాడ మండల వ్యాయామ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు తులసీ సత్యవతి, బి.అన్నాజీరావు, ఎస్.వి.రమణ, శ్రీదేవి, దేవి, అమ్మాజీ, శ్రీలక్ష్మి, గౌరీదేవి తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ భారతి

అగనంపూడి: ఒకరు చేసే నేత్ర దానం ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపుతుందని అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి అన్నారు. 38వ జాతీయ అంధత్వ నివారణ పక్షోత్సవాల సందర్భంగా అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో జిల్లా అంధత్వ శాఖ, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సంయుక్తంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మరణం తరువాత కూడా ప్రకృతిని వీక్షించే అవకాశం నేత్ర దానం వల్ల కలుగుతుందన్నారు. ఇద్దరి జీవితాల్లో వెలుగునివడంతో పాటు మరణం తరువాత కూడా బతికుండే అవకాశం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నేత్రదానం ఆవశ్యకతపై పోస్టర్లు విడుదల చేశారు. ఆర్ఎంవో డాక్టర్ ఉష, గోపీకృష్ణ, ఆప్తమాలజిస్ట్ డాక్టర్ ఆశాశ్రీ,, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, యంగ్ ఇండియా అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ తృప్తి, ఆప్తమాలిక్ అధికారులు కె.ఎస్.సరళ, ధనలక్ష్మి, రాజశేఖర్, రమణి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు అధికారికి ఘన సత్కారం



రమణ దంపతులను సత్కరిస్తున్న సహోద్యోగులు, అధికారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్ బీఎస్‌వై డిప్యూటీ మేనేజర్ ఎల్.వి.రమణను సహోద్యోగులు ఘనంగా సత్కరించారు. నెలాఖరున పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా బుధవారం స్టీల్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రమణ, రాజేశ్వరి దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రమణ ఉక్కు కర్మాగారానికి, అగనంపూడి గ్రామానికి చేసిన సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో విభాగం అధికారులు సి. అనంతరామన్, శ్రీహరి, రాజేశ్వరరావు, డాక్టర్ ముత్యాల బాలాజీ, వివిధ కార్మిక సంఘాల నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, పి.వి.రమణమూర్తి, బి.అప్పారావు, కొమ్మినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.